క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ బంగారుగడ్డ ఫీడర్‌లైన్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ పి. మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుగడ్డ, రాజీవ్‌చౌక్ పరిసర ప్రాంతాలలో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గృహ, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

హాలియా : గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గురుకుల పాఠశాల అవుట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ కమిటీ సభ్యుడు సత్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో పని చేస్తున్న ఆఫీసు అటెండర్లు, నైట్ వాచ్‌మెన్లు, డీఈఓ ఆఫీసు సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే వేతనాలు వేయడంతో పాటు ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అర్హత కలిగిన వారందరికీ ప్రమోషన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి : వాహనదారులు నిబంధనలు పాటించాని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు జరిమానాలు విధించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న, మద్యం సేవించి వాహనాలు నడిపినా చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీలలో టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ తనిఖీలలో ఆర్టీసి కండక్టర్ ఎన్వి నారాయణ, వి.వాల్యా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని చైతన్యనగర్‌లో బోటింగ్ చెరువు వద్ద కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉమెన్స్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చెరువు పరిధిలో ఉన్న సంఘాల మహిళలు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాపటు వాటిని సంరక్షించుకునే బాధ్యత కూడా మహిళలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా డీఎంసీ శివాజీ, టీఎంసీ పోతేపపాక బక్కయ్య, సీవోలు వెంకటేశ్వర్లు, సతీష్‌లతో పాటు ఆర్పీలు సంఘాల మహిళలు తదితరులున్నారు.

మహిళలు సంఘటితం కావాలి

మిర్యాలగూడ అర్బన్ : మహిళలు సంఘటితం కావాలని సీపీఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారతీయ మహిళా సమాఖ్య నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళల పట్ల దాడులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నియోజనవర్గ అధ్యక్ష, కార్యదర్శులు దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, నాయకులు షమీం, సులోచన, అంజమ్మ, శైలజ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ గురుకులాల ఎత్తివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

మిర్యాలగూడ : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలు ఎత్తివేయాలనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని దామరచర్ల ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులకు గురుకులంలో ఇంటర్ విద్య అందుతుందని, కార్పొరేట్ కళాశాలలు రూ. లక్షల ఫీజులు వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో గురుకులాలు పేద విద్యార్థులకు ఆసరాగా ఉన్నాయన్నారు. వాటిని ఇప్పుడు ఎత్తివేయడం ద్వారా పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమేనన్నారు. వెంటనే ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బయోమైనింగ్ వైపు అడుగులు

- తీరనున్న డంపింగ్ యార్డు కష్టాలు
- కంపోస్టు ఎరువుల తయారీకి ప్రణాళిక సిద్ధం
- జూన్ మొదటి వారంలో బయోమినీ ప్లాంటు ఏర్పాటు



మిర్యాలగూడలోని చెత్త డంపింగ్ యార్డు



బయో మైనింగ్ ప్లాంటు నమునా

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు మున్సిపల్ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు హరియానకు చెందిన రీకాల్ అనే స్వచ్ఛంధ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో బయోమైనింగ్ ద్వారా శుద్ధి చేసే ప్రక్రియను జూన్ మాసంలో ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించనున్నారు. ఈ వ్యర్థాలు వివిధ దశల్లో శుద్ధి చేసిన తరువాత వచ్చే బయో ఎర్త్‌తో జీవ ఎరువుగా వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పారిశ్రామికంగా రోజు రోజుకు అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ జనాభా పరంగా కూడా రోజు రోజుకు పెరుగుతుంది. ఈ మున్సిపాలిటీలో 2011 జనాబా లెక్కల ప్రకారం లక్ష 9 వేల 858 మంది ఉండగా ప్రస్తుతం ఆ జనాభా లక్ష 38 వేల మందికి పెరిగింది. అయితే మొఒత్తం 26 వేల 667 గృహాలు ఉండగా మరిన్ని కొత్త నిర్మాణాలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఇటీవల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ జె. శ్రీనివాస్ వేర్వేరుగా పరిశీలించి ఉన్నతాధికారులకు పరిస్థితి వివరించి డంపింగ్ యార్డులో బయోమైనింగ్ విధానాన్ని అమలు నిర్ణయించారు.

ప్రతి రోజు 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులుండగా గృహాలతో పాటు వ్యాపార, వాణిజ్య కేంద్రాల ద్వారా ప్రతి రోజు 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఆయా వార్డుల నుంచి సేకరించిన వ్యర్థాలను డంప్ చేసేందుకు రెండు దశాబ్దాల క్రితం పట్టణ సమీపంలోని రాంనగర్ బంధం వద్ద అరున్నర ఎకరాల భూమిలో యార్డును ఏర్పాటు చేసి డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాతో పాటు గృహాలు కూడా పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా ఈ డంపింగ్ యార్డు సరిపోకపోవడం లేదు. దీంతో మున్సిపాలిటీ ప్రత్యామ్నయ ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఫలితం రాకపోవడంతో చెత్తను రీ సైక్లింగ్ చేసేందుకు బయోమైనింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

తడి, పొడి చెత్త వేరు చేయూ విధానం ఇదే

తడి, పొడి చెత్తపై పట్టణ ప్రజలకు తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయు విధానంపై ప్రతి వార్డులో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలను చేపడుతున్నారు. చెత్తను ఒకే డబ్బాలో వేయకుండా చిత్తు కాగితాలు, పేపర్లు, ప్లాస్టిక్, మెటల్స్‌లవి పనికి రాకుండా పోతుంది. చెత్తలో రెండు రకాలు కాగా పొడి చెత్తలో పేపర్లు, కవర్లు, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, మెటల్స్ వంటి ఉత్పత్తి అయిన చెత్తలో 40శాతం వరకు పొడి చెత్తగా ఉంటుంది. తడి చెత్తలో కూరగాయలు, అన్నం, కూరగాయాల తుక్కు, ఆకులు, పండ్ల తొక్కలు, గింజలు తదితర ఆహార పదార్థాల ఉత్పత్తి 60శాతం ఉంటున్నందున వీటిని ఎరువుల తయారీకి ఉపయోగించుకోవచ్చని అధికారులు చెప్పుతున్నప్పటికి దీనిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. కాగా గతంలో వేస్ట్ వేంచర్ అనే సంస్థ ద్వారా తడి చెత్త, పొడి చెత్తను రీ–సైకిల్ విధానంతో పొడి చెత్తను సక్రమంగా ఉపయోగించారు. కానీ ఈ సంస్థ తాము నడపలేమని చేతులెత్తేయడంతో రీ–సైకిలింగ్ పూర్తిగా నిలిచిపోయింది. మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల నుంచి చెత్తను నాలుగు దశలుగా విభజించిన చెత్తను శుద్ధి చేయడం జరుగుతుంది. అవుట్ పుట్ 8ఎంఎం కన్నా తక్కువగా ఉండటంతో ఎర్త్ బయో అని అంటారు. డంపింగ్ యార్డులో ఆధునీక పద్దతిలో నిర్వహించే ఈ బయో మైనింగ్ విధానం ద్వారా ఎరువులను తయారు చేయడ వచ్చు. వ్యర్థాల ద్వారా ఎంతో విలువైన లోహాలను సేకరించి సూక్ష్మజీవులుగా ఉపయోగించడం జరుగుతుంది. ఆధునీకమైన ఈ పద్ధతితో పర్యవరణానికి ఎలాంటి ముప్పు ఉండకపపోవడంతో పాటు దురువాస, పొగవంటివి వాటికి ఎలాంటి ఇబ్బందులుండవు. తడి. పొడి చెతను వేరు చేసి వర్మీ కంపోస్టు ద్వారా ఎరువులను తయారీ చేసే విధంగా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు.

బయో మైనింగ్ విధానంతో సమస్యలు ఉండవు



మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు బయో మైనింగ్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటాం. ప్రస్తుతం జనాభా పెరుగుతుండటంతో వ్యర్థ్యాలు కూడా పెరుగుతున్నాయి. మరో విశాలమైన డంపింగ్ యార్డు కోసం ఎంతైనా 20 ఎకరాలు అవసరం ఉంది. ఈ బయో మైనింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు అయితే ఎలాంటి సమస్యలు ఉండవు.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

అడవిదేవులపల్లి : రాబోయో సీజనల్ వ్యాధులకు అప్రమత్తంగా ఉండాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భవిత సెంటరు తనిఖీ చేశారు. అనంతతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించిన తరువాత వైద్యులను వివరాలను అడిగి తెలుసుకుంది. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించిన తరువాత వసతులపై అడిగి తెలుసుకుంది. భవిత సెంటర్లలో విద్యార్థులకు కావాల్సిన వసతులు ఆట వస్తువులు, టాయిలెట్ నిర్వహణ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటితో పాటు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించింది. అనంతరం తహసీల్దార్‌తో పలు సమస్యలపై చర్చించారు. వారి వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ రాగ్యారాయక్, డాక్టర్లు రామాంజనేయులు, జానకీరాములు, మండల విద్యాశాధికారి వరలక్ష్మి, వసాయ అధికారిని అర్చన, ఏఈఓ లావణ్య, ఆర్ఐ శ్యాం, ఎస్ఐ శేఖర్ తదితరులున్నారు.

బురదమయంగా రహదారి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నిడమనూరు : చిన్నపాటి వర్షానికి ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన రహదారి బురదమయంగా మారింది. బుధవారం నిడమనూరు మండలంలో 2.8 సెంటిమీటర్ల వర్షం కురిసింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు వర్షపు నీటితో జలమయం అయ్యాయి. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఒకే ప్రాంగణంలో ఉండటంతో కోర్టు ఎదురుగా ఉన్న రహదారి నుంచి ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నీరు నిలిచిపోవడంతో అసౌకర్యంగా మారి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జాతీయ రహదారి నిర్మాణంతో రోడ్డు ఎత్తుగా, కార్యాలయాల ప్రాంగణం దిగువకు కావడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. డ్రైనేజీ సౌకర్యం లేదు. దీంతో నీరంతా నిలిచిపోయి బురదమయంగా మారింది. ఎన్నెస్పీ క్యాంపులోని జడ్జి క్వార్టర్ ఎదుట, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మరోవైపు, పోలీస్ క్వార్టర్స్ రహదారి చిన్న వర్షానికి బురదమయంగా మారింది.

సాగునీరు అందించడమే లక్ష్యం



అంభభవాని లిఫ్టుకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం నేరెడుగొమ్ము మండలంలోని చిన్నమునిగల్ గ్రామ పరిధిలో అంభ భవాని లిఫ్టు పనులను ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ భద్రునాయక్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఈఈ ఎర్రమంద, డీఈ నెహ్రూ, కాంట్రాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, బిక్కు నాయక్, శ్రీశైలంయాదవ్, కృష్ణయ్య, గోవిందుయాదవ్, సర్వయ్య పాల్గొన్నారు.

నేరెడుగొమ్ము మండల సమగ్రాభివృద్ధికి కృషి

నేరెడుగొమ్ము మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం నేరెడుగొమ్ము మండలంలోని తిమ్మాపురం, కొత్తపల్లి, చిన్నమునిగల్, పెద్దమునిగల్ గ్రామాల్లో సుమారు రూ.97లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు నేరెడుగొమ్ము మండల కేంద్రంలో రూ.1.40కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, నాయకులు బిక్కునాయక్, సర్వయ్య, గోవిందుయాదవ్, కృష్ణ, బాలునాయక్, పాపానాయక్, యుగేందర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, వెంకటయ్య, సాయన్న, కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బస్వారెడ్డి, తహసీల్దార్ ఉమాదేవి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

పెద్దఅడిశర్లపల్లి : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దగుమ్మడం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏవిరెడ్డి, ఎలయ్య, సతీష్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : ప్రస్తుతం మున్సిపాలిటీలో నడుస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి పి. రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీని సందర్శించి అనంతరం అమృత్ 2.0 పథకం కింద జరుగుతున్న పనులతో పాటు పలు అభివృద్ధి పనులు, నక్ష, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్నులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ు. మున్సిపాలిటీలో జూన్ 2 నుంచి జరగనున్న వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీలో సిబ్బందిని కూడా ప్రక్షాళన చేపట్టారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్య, టీఎంసీ బక్కయ్య పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంత్యుత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో హనుమాన్ జయంత్యుత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయం వీధిలో గల భక్తాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి–మాధవి దంపతులు, మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లు ష్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 8వేల మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే గుండపాడు రుక్మిణి సత్యభామ సమేతా వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సావాలు, శ్రీ ఉమామహేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సాల సందర్భంగా పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. అలాగే ఎన్ఎస్‌పీ క్యాంపు శాతినంగర్‌లోని ఆంజనేయ స్వామిలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు శాంతినగర్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్ద హనుమాన్ శోభాయాత్రను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర సీతారామాంజనేయ స్వామి దేవాలయం నుంచి మున్సిపల్ రోడ్డు మీదుగా సాగర్ రోడ్డు నుంచి రాజీవ్ చౌక్ వరకు అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర సాగింది.

హాలియా : పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి సహిత శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అబ్రపూడి రమణశర్మ, అర్చకులు భీష్మాచార్యులు, ప్రతాపురం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ జయంతి



మిర్యాలగూడ టౌన్ : ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



హాలియా : ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

నిడమనూరు : మండల వ్యాప్తంగా ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. నిడమనూరు ఆంజనేయస్వామి ఆలయం, పురాతన ఆంజనేయస్వామి ఆలయాలైన వేంపాడు, వెనిగండ్ల, శాఖాపురం గ్రామాల్లో ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. నిడమనూరు ఆలయంలో కొండల్ రెడ్డి కుటుంబ సభ్యులు, శాఖాపురం ఆలయంలో చైర్మన్ గంటా శీనయ్య, వేంపాడులో అర్వ స్వాతి అశోక్, వెనిగండ్లలో కొప్పోలు కుటుంబ సభ్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న లింగారెడ్డి

పెద్దవూర : మండలంలోని నాయినివానికుంట, జయరాంతండా, సంగారం, ఊట్లపల్లి గ్రామాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి పంపిణీ చేశారు. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవడానికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, నాయకులు నాగరాజు, వాసుదేవుల జితేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు బోధిస్తున్నందున ఉపాధ్యాయులు ఆ దిశగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఆర్పీ నూనె సుదర్శన్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు కూడా చాలా సులభతరంగా ఆంగ్ల భాషా నేర్చుకునే విధంగా బోధన అభ్యాసాల ప్రక్రియలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఆర్పీలు గులాం అహ్మద్, మక్బుల్ అహ్మద్, రఘు, సాగరయ్య, సైదిరెడ్డి, తులసీరాం, అంబటి శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంపోడు : ఉపాధ్యాయులు శిక్షణలో చేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేస్తూ విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో సులభతరమైన బోధనను అందించాలని మండల విద్యాధికారి నోముల యాదగిరి అన్నారు. బుధవారం ఎంవీఆర్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా గ్రామస్తులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్‌లు కోదాటి మధుసూదన్, రిజ్వాన్, తిరుమల్‌రావు, డేవిడ్ రామ్, యాదగిరి, విద్యాసాగర్ రెడ్డి, మాలతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని త్రిపురారం ఏపీఓ శ్యామల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఓ శ్యామల మాట్లాడుతూ.. 5 ఎకరాల లోపు నీటి వసతి విస్తీర్ణం ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటల మొక్కల నాటి పెంచుకోవడానికి అర్హులన్నారు. రైతులు పూర్తి వివరాలకు గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాత్రికి రాత్రే లింకు రోడ్డు మాయం!

- లింకు రోడ్డును తన భూమిలో కలువుకున్న రైతు



లింకు రోడ్డు ధ్వంసం చేసిన భూమి

మాడుగులపల్లి : కబ్జాకు కాదేది అనర్హం అన్న రీతిలో నక్షాలో ఉన్న లింకు రోడ్డును పక్కనే ఉన్న రైతు రాత్రికి రాత్రే కబ్జా చేసిన ఘటన బుధవారం మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామంలో చోటు చేసుకుంది. కబ్జాదారుడు వ్యవసాయ భూములకు వెళ్లే లింక్‌రోడ్డును జేసీబీ సాయంతో తమ పొలంలో కలిపేసుకున్నాడు. మండల పరిధిలోని పాములపాడు గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి సబ్‌స్టేషన్ మీదుగా కల్వలపాలెం రోడ్డు వరకు 20 లింకుల బాట ఉంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం రైతులు తమ పొలాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ రోడ్డును ఓ రైతు రాత్రికి రాత్రి కబ్జా చేశాడు. దీనివల్ల ఈ డొంక రోడ్డు నుంచి రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ లేక ఇక్కట్లు

- ఎండలో నిల్చుంటున్న ప్రయాణికులు
- బస్ షెల్టర్ నిర్మించాలని వేడుకోలు



రోడ్డుపై నిలిపిన బస్సు

పెద్దవూర : మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో దశాబ్దాల కాలంగా ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంతో పాటు పక్క మండలాల ప్రజలు సైతం రాష్ట్ర రాజధానికి, ఆంధ్ర ప్రాంతానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాలన్న పెద్దవూరనే కేంద్రంగా ఉంది. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారితో పాటు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి సైతం పెద్దవూర ప్రధాన కూడలిగా ఉంది. అనుముల మండలం ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలన్నా పెద్దవూరకు వచ్చి వెళ్తుంటారు. ఆంధ్రా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి బస్సులు పెద్దవూర మీదుగా వెళ్తుంటాయి. దీంతో ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా పెద్దవూరకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. పదిహేను ఏళ్ల క్రితం పాత ఎంపీడీఓ కార్యాలయం ముందు బస్ షెల్టర్ ఉండేది. రోడ్డు విస్తరణలో బాగంగా దానిని అధికారులు తొలగించారు. అప్పటినుంచి ప్రయాణికుల కష్టాలు మొదలయ్యాయి.

రోడ్లపై ఆపుతున్న బస్సులు

బస్టాండ్ లేకపోవడంతో బస్సులు రోడ్డు పక్కనే ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. రోడ్డు పక్కన ఎక్కువ స్థలం లేకపోవడంతో బస్సులు రోడ్డు మధ్యలోనే ఆపుతున్నారు. ప్రయాణికులు ఎక్కిదిగే వరకు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. బస్సు వెళ్లే వరకు వెనకాల వచ్చిన వాహనాలు అన్నీ ఆగాల్సి వస్తుంది.

నిలువ నీడ కరువు

ప్రయాణాలు చేసే ప్రజలు బస్సుల కోసం పెద్దవూర మండల కేంద్రానికి ఆటోలు, ద్వి చక్రవాహనాలపై వస్తుంటారు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల వెంట నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చిపోయే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఎండలకు ఎండుతూ, వానలకు తడుస్తు రోడ్ల వెంట నిరీక్షిస్తుంటారు. వర్షాలకు, ఎండలకు తాళలేక దుకాణాల ముందు నిల్చోవటానికి దుకాణ యజమానులు దుకాణాలకు అడ్డంగా ఉంటున్నారని తిడుతుంటారని విద్యార్థులు వాపోతున్నారు. చేసేది లేక రోడ్డు వెంట నిల్చుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఆంధ్రా ప్రాంతానికి వెళ్లడానికి రాత్రి సమయాల్లోనే బస్సులు అధికంగా ఉంటాయి. దీనికి తోడు హైదరాబాద్ నుంచి వచ్చే వాళ్లు రాత్రి సమయంలో హాలియా తదితర ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని

దుకాణదారులు తిడుతున్నారు

బస్టాండ్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తు రోడ్ల వెంటనే నిల్చోవాల్సి వస్తుంది. దుకాణాల ముందు నిలబడదామని అనుకున్నా దుకాణదారులు తమ షాపులకు అడ్డం వస్తున్నారని అంటున్నారు. వాళ్ల తిట్లను భరించేకన్నా రోడ్డు పక్కన ఉండటమే మేలని ఎండలోనే నిల్చుంటున్నారు. బస్సులు రోజు ఒకే చోట ఆపకుండా దూరంగా ఆపుతున్నారు. దీంతో బస్సు వెంట ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తుంది.

– కిలారి మురళీయాదవ్, పెద్దవూర